బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

పూజలు చేస్తున్న మాజీమంత్రి జోగు రామన్న

బేల, జనవరి 28: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ వారి అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సదల్‌పూర్‌లో జరుగుతున్న భైరవదేవుడి జాతరలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. మహాదేవ్, భైరందేవ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ తరపున ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి జోగు రామన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాలు అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కుమ్రం భీం స్మారకార్థం జోడేఘాట్ నుంచి మొదలు కొని కేస్లాపూర్‌లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సదల్‌పూర్‌లో రూ.2 కోట్లతో కమ్యూనిటీ హాల్, రోడ్డు, బ్రిడ్జిలను నిర్మించామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల్లో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేయలేని అభివృద్ధి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, ప్రమోద్ రెడ్డి, సతీశ్‌పవార్, దేవన్న, విపిన్ కోడే, బాల్ చందర్, సతీశ్, ఆలయ కమిటీ చైర్మన్ కోరంగే శ్యాంరావ్, అరుణ్, జంగ్ శావ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 28: విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం నిర్మల్‌లోని అంబేద్కర్ భవన్‌లో ఎస్సీ, బీసీ వసతి గృహాల పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ, శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు భయం వీడి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. సమయం వృథా చేయకుండా.. కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఇక్కడ డీఈవో పీ రామారావు, ఎస్సీ, బీసీ, సంక్షేమశాఖ అధికారులు శ్రీనివాస్, రాజేశ్వర్‌గౌడ్, వార్డెన్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కడెం మండలం కొత్తమద్దిపడగలో పునరావాసితులైన మైసంపేట, రాంపూర్ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో పునరావాస గ్రామాల ప్రజలకు కల్పిస్తున్న వసతులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పునరావాసం పొందిన ప్రజలకు కేటాయించిన వ్యవసాయ భూములను సాగుకు యోగ్యంగా మార్చాలన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవో రత్నకళ్యాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

లడ్డూ తయారీ కార్మికుల ఆందోళన

మాట్లాడుతున్న లడ్డూ తయారీ కార్మికులు

ముథోల్, జనవరి 28 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో లడ్డూ తయారీ కేంద్ర కార్మికులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 30 ఏండ్లుగా పని చేస్తున్న తమని కాదని.. వేరే వాళ్లకి పనులు అప్పజెప్పడం సరికాదన్నారు. నాలుగు నెలల క్రితం టెండర్లు నిర్వహించి.. రాత్రికి రాత్రే స్టోర్‌ను అప్పజెప్పడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు వారికి అనుకూలంగా ఉన్నవారికి టెండర్లను ఇచ్చారని ఆరోపించారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపించి లడ్డూ తయారీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఖుష్బూ గుప్తా

బాధ్యతలు స్వీకరిస్తున్న ఖుష్బూగుప్తా

ఎదులాపురం, జనవరి 28: ఆదిలాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల మున్సిపల్ పాలకవర్గం గడువు పూర్తి కావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను నియమించింది.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్

ముథోల్, జనవరి 28: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉండి ఆదుకుంటామని బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డా కొమ్రేవార్ కిరణ్‌కుమార్ భరోసానిచ్చారు. మంగళవారం నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో అనాథలైన చిన్నారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందజేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనాథ చిన్నారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పిల్లలను చేరదీసి, తగిన వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట నాయకులు శ్యామ్, రావుల పోశెట్టి, అశోక్ ఉన్నారు.

పరామర్శ

కుంటాల, జనవరి 28: మాజీ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న తల్లి నర్సమ్మ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు డా కిరణ్ కుమార్ కొమ్రేవార్, కుభీర్ ఏఎంసీ చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చరణ్ పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు, సోషల్ మీడియా జిల్లా ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కిషన్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దీక్షకు మద్దతు తెలుపుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 28 : నిర్మల్ జిల్లా గంజాల్ టోల్ ప్లాజా వద్ద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి.. వేతనం పెంచాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గంజాల్ టోల్ ప్లాజా వద్ద నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏండ్లుగా పని చేస్తున్న కార్మికులను సగం తగ్గిస్తామంటే.. ఎవరు ఊరుకోబోరన్నారు. వీరికి 20శాతం వేతనం పెంచాలన్నారు. మొత్తం 74మందిని ఉండేలా కార్మికులు పోరాటం చేయాలన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు బీఆర్ఎస్ పార్టీ కార్మికులకు అండగా ఉంటుందన్నారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అప్పుడు హామీ ఇచ్చి.. ఇప్పుడు తొలగిస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికుల సమస్యను తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, నాయకులు సుభాష్‌రావు, జీవన్‌రావు, మహేశ్వర్‌రెడ్డి, గంగాధర్, టోల్‌ప్లాజా కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

కేంద్రం ఓపీఎస్ విధానం అమలు చేయాలి

భీంపూర్, జనవరి 28 : కేంద్ర ప్రభుత్వం సీపీఎస్, యూపీఎస్ విధానాలను తక్షణం రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల శాఖ ప్రతినిధులు మంగళవారం భీంపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్‌తో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, శ్రీకాంత్, రజిత, రాజు ,శుభం, గణేశ్ ఉన్నారు.

మహారాష్ట్రలో కందులు అమ్ముకుంటున్న రైతులు

భీంపూర్, జనవరి 28 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని పలు గ్రామాల్లో కంది పంట విస్తీర్ణం సరిగ్గా నమోదు కాని కారణంగా ఇక్కడ రైతులు పంటను తక్కువ ధరకైనా మహారాష్ట్రకు అమ్ముకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో సాంకేతిక సమస్యలతో రైతులు వేసిన కంది పంట విస్తీర్ణాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. ఫలితంగా వారు ఆదిలాబాద్ మార్కెట్‌లో కంది పంటను అమ్ముకునే అవకాశం లేకపోవడంతో ఇక్కడ క్వింటాల్ కంది ధర అధికంగా ఉన్న వేరే దారి లేక తక్కువ ఉన్న మహారాష్ట్రలోని అర్నీ, తదితర మార్కెట్‌లలో అమ్ముకుంటున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రసూతి దవాఖాన సందర్శన

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 28: నిర్మల్ జిల్లా ప్రసూతి దవాఖానను మంగళవారం వైద్య కళాశాల సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్, అదనపు సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ సందర్శించారు. ఓపీ గది, వంట గది పరిసరాలను పరిశీలించారు. మరమ్మతులు ఏమైనా ఉంటే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో సమత, అసోసియేట్ ప్రొఫెసర్ డా సుష్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

తోటి మిత్రునికి చేయూత

నర్సాపూర్(జీ), జనవరి 28 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)కి చెందిన నమిలికొండ సంతోష్ ఇటీవల వ్యవసాయ క్షేత్రంలో ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబానికి పూర్వ విద్యార్థులు (2004-05లో ఎస్సెస్సీ బ్యాచ్) రూ.64,200, తోటి మిత్రుడైన ధనే నవీన్ (సాఫ్ట్‌వేర్) పని చేస్తున్న సంస్థలో సహ ఉద్యోగులు, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎంసీఏ 2013 బ్యాచ్ మిత్రుల ద్వారా సేకరించిన రూ.53,300 ఆర్థిక సాయాన్ని అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతేగాకుండా మండల వాట్సాప్ గ్రూప్‌లోని సభ్యులు కూడా స్పందించి ఆర్థిక సాయాన్ని అందించారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు

కుభీర్, జనవరి 28: చిన్నారులను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేయిస్తామని కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ పీ నవీన్ పేర్కొన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఆ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు కుభీర్‌లోని పలు దుకాణాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టి, ఓ బాలుడిని గుర్తించి విచారణ జరిపారు. ఆ బాలుడిని వారి మామయ్యకు అప్పగించారు. దీంతో సంబంధిత యజమాని ఎండీ రఫీక్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

మొదటి స్థానం రావడం అభినందనీయం

అభినందిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, జనవరి 28 : రక్త సేకరణలో ఆదిలాబాద్ రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మొదటి స్థానంలో రావడం అభినందనీయమని డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. మొదటి స్థానం పొందిన బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని మంగళవారం ఆదిలాబాద్‌లోని ఆయన ఛాంబర్‌లో సత్కరించారు. అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సుధాకర్, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ప్రశాంత్, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ సంధ్యారాణి, సునీల్ కుమార్, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పని చేస్తేనే సాధ్యం

ఇన్ఫెక్షన్ లేని దవాఖానగా రిమ్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో నిర్వహించిన హెచ్ఐసీసీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ట్రైనర్ సిమ్మి కుమారి వ్యర్థాల వేరు గురించి నర్సింగ్ సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏ రంగు డబ్బాలో ఏ వ్యర్థాలు వేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు జాదవ్ సందీప్, పద్మావతి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 28: నిర్మల్ జిల్లాలోని 40మంది పోలీస్ సిబ్బందికి మంగళవారం జిల్లా వైద్య కళాశాలలో వైద్య పరీక్షలు చేశారు. ఉద్యోగోన్నతిలో భాగంగా వీరికి వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఇక్కడ వైద్యులు రవి, విశ్వనాథ్, ప్రశాంత్, నర్సింగ్, సూపరింటెండెంట్ వనజ, వైద్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బాధితుడికి న్యాయం చేయాలని ఆందోళనకు దిగిన గ్రామస్తులు

ఖోడద్‌లో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తలమడుగు, జనవరి 28: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఖోడద్ గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద కేటీసీ టారస్ వాహనం ద్విచక్రవాహనానికి ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మహారాష్ట్ర ప్రాంతంలోని వర్ణి గ్రామానికి చెందిన శంకర్ శిండే (28) ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్నాడు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న కేటీసీ టారస్ వాహనం ఢీ కొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తరచు కేటీసీ వాహనాలు రోడ్డుపై వేగంగా వెళ్తున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని ఖోడద్ గ్రామస్తులు కేటీసీ వాహనాలను నిలిపివేసి ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గంట సేపు ఆందోళన చేయడంతో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ ఫణిందర్, ఎస్ఐలు రాధిక, విష్ణు, ముజాహిద్ ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా చూస్తామని, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడారు. సుంకిడి నుంచి పొన్నారి వరకు రోడ్డుపై గ్రామాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజమ్మ తెలిపారు.

బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదు

సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 28: బయటకు వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదని ఓ మహిళ కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గాంధీనగర్ కాలనీలో గంధం సంతోష్, రమాదేవి నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సంతోష్‌కు బస్టాండ్ సమీపంలో ఫ్యాన్సీ దుకాణం ఉంది. నవంబర్ 18వ తేదీన ఇంటి నుంచి షాప్‌కు వెళ్లిన సంతోష్ తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా, బస్టాండ్ ఏరియాలో పోస్టర్లు అతికించినా జాడా తెలియలేదని తెలిపారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భర్త జాడ ఎవరికైనా తెలిసిన, ఎక్కడైనా కనిపించిన సమాచారం అందించాలని రమాదేవి రోదిస్తూ వేడుకున్నారు.

డైట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే...

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఎదులాపురం, జనవరి 28 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థినులు సినీ, జానపద గీతాలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేయగా తోటి విద్యార్థులు కేరింతలు, చప్పట్లతో వారిని ఉత్సహపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

భైంసా, జనవరి, 28: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పట్టణ ఎస్ఐ గౌస్ సూచించారు. మంగళవారం పట్టణంలోని వేదం పాఠశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

కుంటాల, జనవరి 28: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ఎస్ఐ భాస్కరాచారి పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో రోడ్డు సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రతపై కళాజాత ప్రదర్శన జరిగింది. ఇక్కడ హెచ్ఎం కాసు నవీన్ కుమార్, కార్యదర్శి రాజబాపు, ఉపాధ్యాయుడు మురళీ, తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి, జనవరి 28: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ గౌడ్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు కిశోర్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు ఒకరి ఆత్మహత్య

బొల్లి రాజు(ఫైల్)

ఇచ్చోడ, జనవరి 28: చేసిన అప్పు ఎలా తీర్చాలో నని మనస్థాపనకు గురై ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బోరిగ్రామ గ్రామానికి చెందిన బొల్లి రాజు(40) మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గ్రామ సంఘం నుంచి రూ.9 వేలతో పాటు ప్రైవేట్ అప్పులు చేశాడు. డబ్బులు చెల్లించే తేదీ రావడంతో చేసిన అప్పులు ఎలా తీర్చలోనని మనస్థాపానికి గురై గ్రామ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య బొల్లి వరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

గిన్నీస్ రికార్డులో ఆదివాసీ కళా బృందానికి అరుదైన గౌరవం

మాట్లాడుతున్న సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్

ఇచ్చోడ, జనవరి 28: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల పరిధిలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘానికి ప్రపంచ గిన్నీస్ రికార్డులో స్థానం లభించింది.ఈ సందర్భంగా ఆదివాసీ సకల కళ సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ మాట్లాడుతూ ఢిల్లీలో నిర్వహించిన జయతి జయ మామ భారతం అనే కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం తరపున తమ బృందానికి అవకాశం రావడం అలాగే ప్రపంచ గిన్నీస్ రికార్డులో స్థానం దక్కడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్, కళాకారులు గంగారం, నగేశ్, భాస్కర్, లక్ష్మణ్, సంజీవ్, సందీప్, సాగర్, పరశురాం, శ్రీకాంత్, ప్రకాశ్, గంగారం, విశ్వనాథ్ పాల్గొన్నారు.

డబ్బుల విషయంలో పరస్పర దాడి

ఎదులాపురం, జనవరి 28: ప్రైవేట్ బ్యాంక్ డబ్బులు కట్టలని విషయంలో మహిళలు పరస్పర దాడులు చేసుకున్న ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీకి చెందిన నేహా, బాలక్క ప్రైవేట్ బంధన్ బ్యాంక్‌కు సంబంధించిన డబ్బుల విషయంలో మంగళవారం పరస్పర దాడులు చేసుకున్నారు. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడులు చేసుకోగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ పంచాయితీ మావల పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

ఎదులాపురం, జనవరి 28: ఆదిలాబాద్‌లోని సంజయ్ నగర్‌లోని ఆర్పీఎల్ స్కూల్ మంగళవారం గోడలకు సున్నం వేస్తున్న క్రమంలో నిచ్చెనతో విద్యుత్ షాక్ తగిలి ఇద్దరికి గాయాలయ్యాయి. పాఠశాల కాంట్రాక్టర్ ఇమ్రాన్ ఆదిలాబాద్‌లోని కేఆర్‌కే కాలనీ చెందిన ఖామరు హూడ (22), ఎండీ ఇసాక్ పని చేస్తున్నారు. ఈ క్రమంలో స్కూల్ గోడలకు పైన నిచ్చెనపై ఎక్కి పని చేస్తున్నారు. ఈ క్రమంలో నిచ్చెన ఒక చోట నుంచి మరోచోట జరిపే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు నిచ్చెనకు తగిలాయి. ఇద్దరికి విద్యుత్ షాక్‌తో గాయాలయ్యాయి. నూరుల్ హోడ ఇచ్చినా ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ కాంట్రాక్టర్ ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు ప్రకాశ్ తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం,జనవరి 28 : ప్రైవేట్ రంగాల్లో వస్తున్న అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు స్పందన లభించింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులకు పేటీఎం ప్రతినిధులు ఉస్మాన్, కిరణ్ కుమార్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. చేసే పని గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉపాధి కల్పన ఎంప్లాయిమెంట్ సీనియర్ అసిస్టెంట్ గోవర్ధన్ మాట్లాడుతూ పేటీఎంలో 50 ఖాళీల కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు నిరుద్యోగులు అధికసంఖ్యలో వచ్చారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, జనవరి 28: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత అతిథి అధ్యాపక పోస్టులకు ఫిబ్రవరి 1వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రతాప్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు పీజీలో సబ్జెక్టులో 55 శాతం ఉండాలని నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బోధన అనుభవం పత్రాలు సమర్పించిన వారికి వెయిటేజీ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 3వ తేదీన ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7075999789 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆర్డీవో రోడ్డు పరిశీలన

జైపూర్, జవవరి 28 : జైపూర్ మండలంలోని రామారావుపేట గ్రామస్తులు గోదావరికి వెళ్లే దారిని ఇందారం ఓపెన్‌కాస్టు అధికారులు మూసివేయడంపై గ్రామస్తులు ఆందోళన చేయగా, మంగళవారం మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. పాత రహదారి సమీపంలో ఓబీ డంపులు ఉండడం, భారీ వాహనాలు నడుస్తున్నందున ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని, అందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని తెలిపారు. కాగా, ఆ దారి తమకు ఉపయోగపడదని, పాత దారినే కొనసాగేలా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. జైపూర్ పవర్‌ప్లాంటుకు వేసిన రైల్వే ట్రాక్ పక్క నుంచి గ్రామానికి శాశ్వతంగా రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి దాటవేశారని, దానిని పునఃరుద్ధరించాలని కోరారు. దీంతో పాటుగా గోదావరి వైపు, గోదావరి ఆవల ఉన్న పొలాల వైపు రైతులు వెళ్ళేలా పాతరహదారిని కొనసాగించాలని లేకపోతే ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. స్థానికుల అభిప్రాయాలు విన్న ఆర్డీవో కలెక్టర్‌కు విషయాన్ని విన్నవిస్తానని తెలిపారు. తహసీల్దార్ వనజారెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ముథోల్, జనవరి 28: బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నూతన ఆలయ ఉద్యోగ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంజీవ్ పూజారీ, గౌరవ సలహాదాడిగా సహాయ కార్యనిర్వహణ అధికారి ఆర్ సుదర్శన్, గౌరవాధ్యక్షుడిగా ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్, ఉపాధ్యక్షుడిగా ఎస్ రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా వేద పండితులు కందికోట నవీన్‌శర్మర్, సంయుక్త కార్యదర్శిగా హరీశ్, కోశాధికారిగా బీ హరీశ్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నిర్మల్ అర్బన్, జనవరి 28: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా నిర్మల్ ఆర్టీసీ డిపోలో లయన్స్ క్లబ్, లక్ష్మీకావేరి కంటి దవాఖాన ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిపోలో 81మంది ఉద్యోగులకు పరీక్షలు చేశారు. ఇక్కడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్లు ఐ రాజశేఖర్, నవీన్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రమోహన్, సెక్రటరీ శ్రీనివాస్‌యాదవ్, కోశాధికారి లక్ష్మీనారాయణగౌడ్, ప్రోగ్రామర్ శంకర్‌రావు, సిబ్బంది ఉన్నారు.